
## ఏప్రిల్ నెల భావపరిచయ పోటీ

**బహుమానం రూ. 25-00**



ఈ కార్టూనుకు హాస్యయుత వ్యాఖ్య (Caption) కావాలి.

గమనిక : వ్యాఖ్యలు పోస్టుకార్డుపై వ్రాసి ఏప్రియల్ 20వ తేదీలోగా పంపాలి

## మార్చి నెల భావపరిచయ పోటీ

**రు. 25-00 బహుమతి పొందిన వ్యాఖ్య**

పేరుకు మాత్రమది బస్‌స్టాప్

బస్‌కు మాత్రమది నాన్‌స్టాప్

—శ్రీమతి సి. హెచ్. నిర్మల
విజయవాడ-3

# పొత్తూరు నాగేశ్వరరావు ఆధునిక నీతికథలు

లక్ష్మీనారాయణమ్మకు గగన్‌మహల్ రోడ్డులో ఓ పెద్ద బిల్డింగ్ వుంది. పద్దెనిమిది వందల అరవైఅరు గజాల్లో నిర్మించబడింది. అది మూడంతస్తుల భవనం. మెయిన్ బిల్డింగ్ ప్లింత్ ఏరియా ఏడువేల రెండొందల చదరపు అడుగులు. వెనకప్రక్కన ఆరుగదుల అవుట్ హౌస్; తూర్పున ఎనిమిది మడిగలు. మరో ప్రక్కన కారు గేరేజీ; దానిపైన ఓ చిన్న పోర్షన్. మొత్తం ఆ కాంప్లెక్స్‌లో పదహారు కుటుంబాలవారు అద్దెకుంటున్నారు.

పందొమ్మిది వందల డెభ్భైనాలుగులో దాన్ని కట్టినప్పుడు అది అత్యాధునికమైన భవనమే. ఆ రోజుల్లో ఆవిడ భర్త రోడ్డు- భవనాల శాఖకు కాంట్రాక్టరుగా వుంటూ, గవర్నమెంట్ హాస్పటల్ బిల్డింగ్స్, డాక్టర్సు క్వార్టర్సూ కట్టిస్తూ మిగిల్చిన సిమెంటూ, స్టీలూ, ఇతరత్రా మెటీరియల్స్‌తో అంత పెద్ద భవనాన్ని అతి తక్కువ వ్యయంతో కట్టించాడు. ఆ భవనంలో గృహప్రవేశం చేసిన ముప్పైఆరు మాసాలకు లక్ష్మీనారాయణమ్మ భర్త గుండెపోటుతో హఠాత్తుగా మరణించాడు. ఇంటివాస్తుకూ, భర్త మరణానికీ పొత్తు ఎక్కడా లేదునేది తర్వాత ఆవిడ వాస్తుశాస్త్రజ్ఞుల ద్వారా నిర్ధారణ చేసుకుంది.

లక్ష్మీనారాయణమ్మకు ఇద్దరు మగపిల్లలు. వాళ్ళకు చదువుమీద కంటె మిగతా విషయాలపై ధ్యాస ఎక్కువ. సినిమాలు చూడడం, హోటళ్ళలో తినటం, ఆటలు ఆడటం, కారులో తిరగడం మొదలైన వాటితో జల్సా చేస్తూ వుంటారు. టెన్త్‌క్లాసు పరీక్షలకు మార్చి, సెప్టెంబరుకు లోకల్ ట్రెయిన్‌లా తిరుగుతున్నారు. వాళ్ల చేతుల్లో చదువురేఖలు సూచాయగా కూడా లేవని గ్రహించిన లక్ష్మీనారాయణమ్మ వాళ్లను 'ఇష్టారాజ్యం భరతుడి పట్టం'లా వొదిలేసింది. నెలనెలా వాళ్ల ఖర్చులకు ఒక పోర్షన్ అద్దెమాత్రం ఇస్తుంది. ఆ పైన ఏడు రకాలుగా ఏడ్చినా ఏడు పైసలు ఇవ్వదు.

భర్త బతికుండగా డబ్బు విలువను గురించి ఆవిడ ఆలోచించలేదు. భర్త చనిపోయాక, భర్త మిగిల్చిన ఆస్తులూ, డబ్బూ, బంగారమూ చూశాక

ప్రపంచంలో అతిముఖ్యమైన, అత్యంత విలువైన వస్తువు 'డబ్బు' అనే పదార్థమేనవీ, దానిచుట్టూ అనుక్షణమూ లోకంలోని మనుషులు నిర్విరామంగా పరిభ్రమిస్తూ వుంటారనీ తెల్సుకుంది. భర్త చనిపోయాకనే ఇంటిచుట్టూ వున్న గార్డెన్‌ను సమూలంగా తొలగించి అవుట్‌హౌస్‌ను, మడిగల్ని, గ్యారేజీపై పోర్షన్‌కు వేయించింది– అద్దెల కోసం. అద్దెలమీద ఆవిడకు నెలనెలా పదకొండు వేల రూపాయలొస్తాయి.

లక్ష్మీనారాయణమ్మకు తన వాకిలే వారాణాసి; తన ఇల్లే వైకుంఠం. సాధారణంగా ఎప్పుడూ బయటికి పోదు. ప్రొద్దున లేచింది మొదలు రాత్రి పడుకొనేవరకూ జన్మజన్మాంతరాల వాసనగల పెంపుడు జంతువులాగా ఆ కాంప్లెక్స్‌లోనే తిరుగుతూ వుంటుంది. రోజు కొకసారైనా అందులో అద్దెకున్న వాళ్లందర్నీ ఎంత ఆప్యాయంగా పలకరిస్తుంది. ఎంత ఆప్యాయంగా పలకరించినా, ఎంతహాయిగా చిరునవ్వు నవ్వినా అద్దె వసూలుదగ్గరమాత్రం ఆవిడ యమా కరెక్టుగా వుంటుంది. అయిదోతారీకులోపల ఎవరైనా అద్దె ఇవ్వకపోతే ఆరోతారీకు ఉదయం ఏడున్నర గంటలకు కబురు పెడుతుంది; ఆపైన మూడురోజుల తర్వాత ద్దెకు ఇంటికొచ్చేఇవ్వకపోతే–తానే స్వయంగా వచ్చి అడుగుతుంది. ఆ విధంగా రెండుసార్లు ఎవరైనా అడిగించుకొంటే, ఆ మరుసటి నెలలోనే ఇల్లు ఖాళీచేయమని తాఖీదు పంపుతుంది. అందుచేత లక్ష్మీనారాయణమ్మగారు నోటితో 'ఈ నెల ఇంకా అద్దె ఇవ్వలేదేం?' అని అడిగితే అది ఫస్ట్ వార్నింగ్‌గా పరిగణిస్తారు.

ఇంట్లో పోర్షన్లను అద్దెకివ్వడం, మూడు మాసాల అద్దెను అడ్వాన్సుగా పుచ్చుకోవడం, ఎవరైనా ఖాళీచేస్తామంటే చెయ్యమనడం, పోర్షన్ ఖాళీ అయినప్పుడల్లా యాభైరూపాయల అద్దె పెంచడం, నీళ్ళు రావడంలేదు, మోటారు వేయండి అని అడిగించుకోవడం, ఖాళీఅయిన పోర్షన్లకు కొత్తగా అద్దెకు వచ్చే వాళ్ళను నానారకాలుగా ప్రశ్నలు వేయడం నిత్యజీవితంలో లక్ష్మీనారాయణమ్మకు డబ్బు ఆదాయంతోపాటు కులాసా అయిన కాలక్షేపమైపోయింది.

అవుట్‌హౌస్‌లో మూడుగదుల పోర్షన్ ఖాళీఅయింది. ఓ రోజు సాయంకాలం ఓ ప్రైవేటు ఆఫీసులో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న ఓ మధ్యవయస్కుడూ ఆయన భార్యా వచ్చారు ఆ పోర్షన్‌కోసం. పోర్షన్ చూశాక వారికది నచ్చింది. ఆఫీసుకు దగ్గర, పైగా పిల్లల స్కూళ్ళకు దగ్గర. ఇంకేంకావాలి? ట్రాన్స్‌పోర్ట్



చార్జీలు ఏతావాతా నెలకు నూటయాభై దాకా కల్సివస్తాయని ఆ మానవుడు ఆ పోర్షన్‌ను అద్దెకు తీసుకొనేందుకు ఇష్టపడ్డాడు.

"మీ పేరు?

.... .... ....

"ఏ ఆఫీసులో పనిచేస్తారు?"

"ట్రాన్స్‌ఫర్లు ఉంటాయా?"

.... .... ....

"నెలకు జీతమెంత?"

.... .... ....

"నెలకు ఎంతమంది బంధువులొస్తారు?"

.... .... ....

అప్పటివరకూ అనుకూలమైన సమాధానాలే వచ్చాయి.

"పిల్లలెంతమంది?" అంది లక్ష్మీనారాయణమ్మ ఇంటర్వ్యూలో ఆఖరి ప్రశ్నగా.

భర్త భార్యమొహంకేసి చూశారు. భార్య ఇంటియజమానురాలి మొహంకేసి చూసింది.

పిల్లలసంగతి అడిగేసరికి వాళ్ళు అంత మల్లగుల్లాలు పడడం లక్ష్మీనారాయణమ్మకు అబ్బురమనిపించింది.

"ఇద్దరండీ" అన్నది భార్య.

భర్త పెళ్ళాంకేసి ఆశ్చర్యంగా చూశాడు. అయితే భర్త మొహంలోని ఆశ్చర్యస్థాయిని లక్ష్మీనారాయణమ్మ కనిపెట్టలేదు. ఆమె చెప్పిన అద్దెకు ఆ దంపతులు ఒప్పుకున్నారు. మూడుమాసాల అద్దె అడ్వాన్సుగా ఇచ్చారు వస్తుతారీఖునే అకౌంటెంట్ తన సంసారంతో, సామానుతో ఆ పోర్షన్‌లో ప్రవేశించాడు.

అకౌంటెంటూ, ఆయన భార్యా, తల్లీ, రోగిష్టి తండ్రీ, ఇద్దరు మగపిల్లలూ, ముగ్గురు ఆడపిల్లలూ– మొత్తం తొమ్మిదిమంది దిగారు. సాయంత్రానికి సామాను సర్దుకొని సెటిల్ అయిపోయారు.

లక్ష్మీనారాయణమ్మకు ఆశ్చర్యంతోపాటు ఆగ్రహం వేసింది, నలుగురని చెప్పి తొమ్మిదిమంది పటాలం ఇంట్లో చేరారు. అద్దెకిళ్ళ నిర్వహణలో ఆవిడ

కొన్ని సూత్రాల్ని ఏర్పర్చుకుంది. వాటికి భిన్నంగా ఎవరైనా ప్రవర్తిస్తే ఆవిడకు ఇట్టే ఆగ్రహం వస్తుంది. మూడ్రోజుల తర్వాత ఉదయం పదకొండు గంటలకు అవుట్‌హౌస్ ముందున్న జామచెట్టునీడన కుర్చీలో కూర్చున్న అకౌంటెంట్ భార్యను అడిగింది లక్ష్మీనారాయణమ్మ.

"ఇంట్లో చాలామంది ఉంటున్నారనుకుంటాను."

"అబ్బే! అంత ఎక్కువమంది ఎవరున్నారు? అందరూ కుటుంబసభ్యులే."

"మా అత్తగారు, మామగారు ఏదో మందులుతింటూ రెణ్ణెల్లపాటు ఇక్కడుంటారు. ఆ పైన వాళ్ళవూరు పోతారు. మిగతా వాళ్ళంతా...."

"మీవాళ్ళేనా?"

"అవును."

"అయిదుగురు పిల్లలున్నారు. ఇద్దరు పిల్లలనే చెప్పారు."

"ఆఁ.... అదా! అవునండి. అందులో ముగ్గురు అమ్మాయిలు. మీతో ఇద్దరు పిల్లలని చెప్పినమాట నిజమేననుకోండి. ఆడపిల్లలసంగతి చెప్పలేదు. వాళ్ళూ మా పిల్లలే అయినప్పటికీ, చూడండి! ఆడపిల్లలు పర్మినెంట్‌గా ఇక్కడ వుండిపోతారా? పెళ్ళిళ్ళు అయిపోయాక వాళ్ళవాళ్ళ భర్తలతో కాపురాలకు పోతారు కాబట్టి ప్రత్యేకంగా చెప్పలేదు. మరేమీ అనుకోకండి! ఇందులో నేను ఆడిన పెద్ద అబద్ధమూ లేదు...." అంది అకౌంటెంటుభార్య సుతిమెత్తనగా నవ్వుతూ.

లక్ష్మీనారాయణమ్మ ఓ నిమిషంపాటు నిలారిపోయి చూసి, తన ఇంట్లోకి వెళ్ళిపోయింది.

*అద్దె ఇంటికోసం కన్నపిల్లల్ని గురించి అబద్ధం ఆడవచ్చునా?*

---

**మే సంచికలో శ్రీ ఆదూరి వెంకటసీతారామమూర్తిగారి పూర్తినవల**

**ఈశ్వర్ అల్లా తేరేనామ్**

**ప్రచురింపబడుతుంది**

---

# "భో... జనం"

ఆ రాత్రి వెన్నెల్లో, ఆరుబయల్లో–

వంటిమీద చిగురులు పడ్డ పంచెతప్ప మరే ఆచ్ఛాదనా లేని శ్రీరాములు కుక్కిమంచంలో దొర్లుతూ, కొడుకు 'పెద్దోడు' అడిగిన దానికి దిగులుగా నవ్వాడు. అతడికా నవ్వు ఎన్నో రోజులుగా అలవాటైన నవ్వు.

ప్రక్కనే వున్న గుడిసెవైపు చూసాడు. అతడా యింటిదాని మొగుడు.

అతడి యింటిప్రక్కనే అతడి యింటి వంటివే చాలా గుడిసెలున్నాయి. వాళ్ళందరి బ్రతుకులు ఒకేలా వుండే 'ఫోటోస్టాటు' కాపీలు.

సంపాదించిన రోజే కడుపులోనికి కాస్త భోజనం వెళ్తుంది. వారానికి రెండు, మూడు రోజులు పని వుండదు ఒక్కొక్కప్పుడు. అలాంటప్పుడు తమ కెన్నో ఏళ్ళగా అలవాటైన 'ఆకలి వస్తులు' వుంటుంటారు.

అటువంటప్పుడు రేపో, మాపో రెండో, మూడో సంపాదిస్తామని కలలు కని, కడుపాకలి మర్చిపోవటానికి ప్రయత్నిస్తుంటారు పెద్దోళ్ళు.

అది చేతకాని చిన్నోళ్ళు అమాయకంగా వాళ్ళ అయ్యల్ని అడుగుతారు.

"అయ్యా! అన్నం లేదే?"

"అన్నమట్రా, వారరారేయ్! ఇయ్యాళ దేవుడికి దణ్ణమెట్టుకున్నావా?"

'లేద'న్నట్లు అడ్డంగా తల వూపాడు పెద్దోడు.

"అద్గదీ! అందుకే కామోసు దేవుడికి మా చెడ్డ కోపమొచ్చేసి, మన బువ్వని కాస్తా చూసావా, ఆకాశంలో అన్నపు మెతుకులగా యెలా అరెట్టేసాడో! ఆకాశంకేసి చూ(పి)స్తూ, అన్నాడు శ్రీరాములు.

"సుక్కలేనా అన్నం మెతుకులు!" అమాయకంగా అడిగాడు పెద్దోడు.

"అవున్రా, రేపేళమటుకు బువ్వ తిందువులేరా, అమ్మకాడి కెళ్ళి బజ్జో" కొడుకుని అనునయించాడు శ్రీరాములు.

కలలు కంటూ, నిద్రపోయాడు పెద్దోడు. అతడి కలలో కళ్ళముందు కదలాడింది– సత్తుగిన్నెలోని గంజిలో నుండి పైకి చూస్తున్న అన్నపు మెతుకులు.

శ్రీరాములు ఆకాశంకేసి చూస్తూ,

---

'విపంచి'